





**చాలా ఆనందంగా ఉంది**

నేను గత సంవత్సరం ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో పాల్గొన్నాను. నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో పరిగణించలేదు. నిబంధనలు తెలుసుకుని, ఆ ప్రకారం ఈ సంవత్సరం ముగ్గు వేశాను. బహుమతి వస్తుందనుకున్నా కానీ ఏకంగా ప్రథమ బహుమతి వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. ఆంధ్రజ్యోతి మాఇంటికి ముందే సంక్రాంతి తెచ్చింది.

- పాపన సుజాత, మాదల



**ఐదేళ్ల నుంచి వస్తున్నా...**

నేను ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో పాల్గొంటున్నాను. ఎప్పుడూ కన్సోలేషన్ బహుమతి వచ్చేది. ఈసారి ద్వితీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది. బహుమతి వచ్చినా రాకపోయినా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో తప్పకుండా పాల్గొంటాను. పత్రిక అంటే కేవలం వార్తలు అందించడమే కాకుండా మన సంస్కృతిని పరిరక్షించే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా గొప్ప విషయం.

- కుంట దుర్గాదేవి, వినుకొండ



**ప్రథమ బహుమతే లక్ష్యం**

ఏడేళ్లుగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాను. ప్రతిసారి బహుమతి వస్తుంది. గతంలో ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు పొందాను. ఈసారి ద్వితీయ బహుమతి దక్కింది. ఎప్పటికైనా ప్రథమ బహుమతి పొందడం నా లక్ష్యం. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో బహుమతి పొందడం ప్రతిభకు గీటురాయిగా మహిళలు భావిస్తారు. సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రస్తుతతరాలకు అందిస్తున్న ఆంధ్రజ్యోతికి మహిళలు ఋణపడి ఉంటారు.

- కె.కృష్ణరత్నం, నరసరావుపేట

# ఇలపై.. ఇంద్రధనుస్సు

- నరసరావుపేటలో రంగవల్లుల సంబరం
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- రంగవల్లులతో పులకించిన ఎస్ఎస్ఎన్ కళాశాల
- విజేతలకు బహుమతుల అందజేసిన సుబ్బరాయగుప్తా



ముగ్గులను పరిశీలిస్తున్న స్పాన్సరర్స్ శారదాంబ జ్యూయలర్స్ నాగసరపు సుబ్బారాయ గుప్తా, అనురాధ, రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తా





నరసరావుపేట కల్చరల్, జనవరి, 7. సప్తవర్ణ శోభితంగా.. సంస్కృతి.. సంప్రదాయాలు ఉట్టిపడేలా నారీమణులు వేసిన ముగ్గులతో ఇలపైకి ఇంద్రధనుస్సు దిగివచ్చింది. మహిళలు, యువతులు, విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగవల్లులతో నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణం పులకించింది. వారం ముందే సంక్రాంతి వచ్చిందా అన్నంత సంబరంగా నరసరావుపేటలో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీకి మహిళలు, విద్యార్థునుల నుంచి విశేష స్పందన లభించగా ఆ ప్రాంతంలో ముగ్గుల హరివిల్లు ఆవిష్కృతమైంది. చిట్టిచేతులతో చిన్నారులు.. కొంగుబిగించిన మహిళలు.. రంగవల్లులను తీర్చిదిద్దారు. సందేశాత్మకంగా, సంప్రదాయం ఉట్టిపడేలా.. సంక్రాంతి శోభను ముందస్తుగా కళ్లకు కట్టినట్లుగా ముగ్గులు వేశారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సంయుక్తంగా శారదాంబ జ్యూయలర్స్ సౌజన్యంతో ఆదివారం నరసరావుపేటలో ముగ్గుల పోటీ జరిగింది. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన ముత్యాల ముగ్గులు పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థునులు హాజరయ్యారు. రంగురంగుల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పదేళ్ల పాప నుంచి డెబ్బై ఏళ్ల వృద్ధుల వరకు ఉత్సాహంగా పోటీలో పాల్గొని ముగ్గులను తీర్చిదిద్దారు. వినుకొండ, సత్తెనపల్లి, నడికుడి వంటి సుదూర ప్రాంతాలకు చెందిన వారు కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేసిన అనంతరం లలితకళాతోరణం ఆడిటోరియంలో బహుమతులు ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభలో శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ ముగ్గులు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమన్నారు. అపార్ట్‌మెంట్ల సంస్కృతి వచ్చాక మహిళలకు ముగ్గులు వేసే అవకాశం తగ్గిపోయిందని, ఈ పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి పోటీల ద్వారా కొత్త తరానికి ముగ్గుల పట్ల ఆసక్తిని కలిగించవచ్చని, తద్వారా ముగ్గుల సంస్కృతి అంతరించి పోకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మా వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఇది ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుప్తా కుటుంబసభ్యులు అనూరాధ, రూపేష్‌గుప్తా, రాందేవ్ గుప్తాలు పాల్గొన్నారు. న్యాయవాది కె.భవాని, ఉపాధ్యాయిని విజయలక్ష్మి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.







ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి పొందిన పాపన సుజాతకి రూ .6 వేలు అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ, రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తా



ద్వితీయ బహుమతి రూ .4 వేలు అందుకుంటున్న కుంట దుర్గాదేవి



తృతీయ బహుమతి రూ.3 వేలు అందుకుంటున్న కే కృష్ణ రత్నం







ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శారదాంబ జ్యూయలర్స్ నిర్వహించిన ముగ్గుల పోటీలో కన్సోలేషన్ బహుమతులు అందుకుంటున్న శిరీష, జీ అశ్విని, ఏ పావని

**విజేతలు వీరే..**

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన పాపన సుజాత, ద్వితీయ బహుమతి వినుకొండకు చెందిన కుంట దుర్గాదేవి, తృతీయ బహుమతి నరసరావుపేటకి చెందిన కె.కృష్ణరత్నం అందుకున్నారు. వర్రా శిరీష, జి.అశ్విని, ఎ.పావని కన్సోలేషన్ బహుమతులను దక్కించుకున్నారు. వీరికి స్పాన్సరర్ శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికి పార్టిసిపెంట్ గిఫ్ట్ అందజేశారు.

# నృసింహస్వామి సేవలో లోకేశ్

- మంగళగిరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- 20 లక్షల విలువ చేసే ఆభరణాల వితరణ
- పానకాలస్వామి నడక మార్గంలో మెట్ల పూజ

హాజరైన భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మిణి, దేవాన్ష్



ఈవో రామకోటిరెడ్డికి బంగారు ఆభరణాలను అందజేస్తున్న భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మిణి, దేవాన్ష్

మంగళగిరి సిటీ, జనవరి 7: మంగళగిరిలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులతోపాటు శివాలయంలో ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మిణి, తనయుడు దేవాన్ష్‌తో కలిసి లోకేశ్ మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు లోకేశ్ కుటుంబ సభ్యులకు ఘనస్వాగతం పలికారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీచెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలను సమర్పించారు. చెంచులక్ష్మీ అమ్మ వారికి బంగారు కిరీటం, రాజ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు పంచ పాత్ర, ఉద్ధరిణి అందజేశారు. అక్కడి నుంచి కాలినడకన శివాలయం చేరుకుని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. గతంలో ఆయన మొక్కు కున్న మొక్కును తీర్చుకునే నిమిత్తం పానకాలస్వామి సన్నిధిని చేరుకునే నడక మార్గంలో లోకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి మెట్ల పూజ చేశారు. పానకాల స్వామి సన్నిధిలో పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం రాజ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని కంఠహారం(నెక్లెస్) సమర్పిం చారు. స్వామివార్లకు సుమారు 20 లక్ష ల విలువ చేసే 320 గ్రాముల బంగారు ఆభరణాలను లోకేశ్ కు టుంబ సభ్యులు ఈవో ఎ.రామకోటిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్ర మాల్లో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబ ద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్ల మెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రజలతో..

# రేంజ్‌లో 16 మంది సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 7: రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిబంధన లను అనుసరించి పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఎస్ఐలను బదిలీ చేయగా తాజాగా సీఐలను బదిలీ చేశారు. బీ అశోక్‌కుమార్‌ను చిలకలూరిపేట రూరల్ నుంచి నెల్లూరు వన్ టౌన్‌కు, వీ శ్రీనివా సరెడ్డిని ఒంగోలు రూరల్ సర్కిల్ నుంచి నాయుడుపేటకు, కే నరసింహారావును నాయుడుపేట నుంచి సంతమాగులూ రుకు, బీ ప్రభాకర్‌ను సంతమాగులూరు నుంచి రేంజ్ వీఆర్‌కు, ఏ రాజమోహ నరావును చుండూరు సర్కిల్ నుంచి ఒంగోలు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా డీ జగన్మోహనరావును రేంజ్ వీఆర్ నుంచి నాయుడుపేట సర్కిల్‌కు, వై వీర సోమయ్యను నాయుడుపేట సర్కిల్ నుంచి రేంజ్ వీఆర్ గుంటూరుకు, జీ దశరథ రామయ్యను రేంజ్ వీఆర్ నుంచి తెనాలి వన్ టౌన్‌కు, కే చంద్రశేఖర్‌ను తెనాలి వన్ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను పొన్నూరు టౌన్ నుంచి నెల్లూరు ఫోర్త్ టౌన్‌కు, బీవీవీ సుబ్బారావును నెల్లూరు ఫోర్త్ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, సీ కృష్ణారెడ్డిను కమాండ్ కం ట్రోల్ రూమ్ తిరుపతి నుంచి నరసరా వుపేట వన్ టౌన్‌కు బదిలీ చేశారు. ఏ అశోక్ కుమార్‌ను నరసరావుపేట వన్‌టౌన్ నుంచి పల్నాడు డీసీఆర్బీకు, ఎస్ నరసింహారావును పల్నాడు డీసీఆర్బీ నుంచి రేంజ్ వీఆర్‌కు, యూ శోభన్‌బాబును పల్నాడు ట్రాఫిక్ నుంచి డీటీఆర్‌బీ పల్నాడుకు, టీ విజయ కృష్ణను డీటీ ఆర్‌బీ నుంచి పల్నాడు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

# దాడులు.. తనిఖీలు.. కేసులు

**2023 అంతటా కొరఢా ఝుళిపించిన ఆర్‌పీఎఫ్**

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) గత ఏడాది అంతా విస్తృతంగా దాడులు, తనిఖీలు నిర్వహించి పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసింది. వందల సంఖ్యలో నేరస్థులను అరెస్టు చేసి జైళ్లకు పంపించింది. రూ.కోట్ల విలువ చేస్తే రైల్వే ఆస్తులను రికవరీ చేసింది. ఆదివారం 2023 సంవత్సరం నివేదికని ఆర్‌పీఎఫ్ విడుదల చేసింది. మిషన్ రైల్ సురక్ష కింద రైల్వే ఆస్తులను చోరీ చేసిన 70 మంది క్రిమినల్స్, 12 మంది రిసీవర్లను పట్టుకుని రూ.90 లక్షల 91 వేల 547 విలువ చేసే సొత్తుని రికవరీ చేసింది. రైల్వే చట్టం కింద 3,486 కేసులు నమోదు చేసి 3,444 మందిని అరెస్టు చేసింది. వారిలో 3,561 మందికి శిక్ష పడిందని, ఫైన్ రూపంలో రూ.9.14 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నది. ఆపరేషన్ ఉపలబ్ద్ కింద 15 మంది దళారులను అరెస్టు చేసి 42 లైవ్ టిక్కెట్‌లు రూ.53,345 విలువ చేసేవి సీజ్ చేసింది. 72 పర్సనల్ యూజర్ ఐడీలను ఈ సందర్భంగా బ్లాక్ చేశారు. మిషన్ యాత్రీ సురక్ష కింద 71 చోరీ కేసుల్లో 32 మంది క్రిమినల్స్‌ని అరెస్టు చేసి రూ.26 లక్షల 97 వేల 500 విలువ చేసే సొత్తుని రికవరీ చేసింది. ఆపరేషన్ సంరక్ష కింద ఎవరైతే రైళ్లపై రాళ్లు రువ్వారో 20 కేసులు నమోదు చేసి 48 మంది నిందితులను అరెస్టు చేసింది. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఎవరైతే రైళ్లలో పేలుడు పదార్థాలు తీసుకెళుతున్నారో వారిని అరెస్టు చేసింది. మిషన్ మహిళ సురక్ష ద్వారా 2,149 రైళ్లలో 3,168 మంది మహిళ ప్రయాణికులతో మాట్లాడి ఒంటరిగా ప్రయాణిస్తున్న వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. ఆపరేషన్ సతారక్ కింద 1,744 మద్యం సీసాలను రికవరీ చేసింది. దీనికి సంబంధించి 29 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నది.


తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

# అడ్డగోలు పాలనకు చరమగీతం తప్పదు

- రాజధానికి భూములిస్తే వార్షిక కౌలు ఇవ్వడానికీ ఇష్టపడటం లేదు
- మూడు ముక్కల ఆటతో కాలక్షేపం చేస్తున్న సీఎం జగన్‌రెడ్డి
- 1482వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 7: వైసీపీ అడ్డగోలు పాలనకు చరమగీతం తప్పదని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు ఆదివారం నాటికి 1482వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణం కోసం మూడు పంటలు పండే జీవనాధారమైన భూములిస్తే.. అభివృద్ధి పనులు కొనసాగించకపోగా, వార్షిక కౌలు ఇవ్వటానికి కూడా సీఎం జగన్‌రెడ్డి ఇష్టపడటం లేదన్నారు. జీవనం ఎలా గడవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి భూములిచ్చామన్నారు. కనుక ప్రభుత్వమే రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నిరుపేదలకు ఇచ్చే పింఛన్ రూ.5వేలుకు పెంచుతామన్న హామీని అమలు చేయాలన్నారు. రాజధాని నిర్మాణ పనులు నిలిపివేయటంతో ఉపాధిలేక కూలీలు వలసపోతున్నారని చెప్పారు. హైకోర్టు తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అలాగే రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఆడుతున్న మూడు రాజధానుల ఆటను రద్దు చేసుకోవాలన్నారు. ఒక రాజధాని అభివృద్ధి పనులు కొనసాగించటానికే దిక్కులేదు కానీ.. మూడు ఎలా కడతారని ప్రశ్నించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

# ఎంట్రీ పాసుపై లక్కీడీప్ ముద్ర


వైఎస్ఆర్ సంక్రాంతి సంబరాల ఎంట్రీ పాసుపై లక్కీడీప్ అని ఉన్న దృశ్యం

సత్తెనపల్లి, జనవరి 7: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో చట్ట విరుద్ధమైన లాటరీ టిక్కెట్ అమ్మకాలను నియోజకవర్గంలో చేయిస్తున్నారని టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుపేదలకు, వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌లో రూ.వంద వలంటీర్లు ఎంట్రీ పాసుకు కట్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం లాటరీ టిక్కెట్ల అమ్మకం జరిపినందుకు న్యాయస్థానం ఆదేశాల మేరకు అంబటిపై క్రిమినల్ కేసు నమోదైందన్నారు. అయినా మంత్రి తన పద్ధతిని మార్చుకోలేదని, ఈ సంవత్సరం ఎంట్రీ పాసు పేరుతో రసీదులో లక్కీడీప్ అని ఉందన్నారు.

# ఫ్లెక్సీలను చించేసి వైసీపీ వీరంగం

- భారీగా రోడ్లపైకి వచ్చిన టీడీపీ నాయకులు
- డీఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు


డీఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు


మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఫ్లెక్సీలను చించివేసిన దృశ్యం

రాజ్యలక్ష్మీ థియేటర్ వద్ద భారీఫ్లెక్సీని చించివేసిన వైసీపీ నాయకులు

రేపల్లె, జనవరి 7: ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వైసీపీ అల్లరిమూకలు ఆదివారం మధ్యాహ్నం ఇష్టమొచ్చినట్లుగా చించివేసి బూతులు తిడుతూ అల్లర్లు సృష్టించారు. దీంతో ఒక్కసారి పట్టణం అంతా ఉలిక్కిపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, రాజ్యలక్ష్మీ సెంటర్‌లకు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. ఫ్లెక్సీల చించివేత విషయం టీడీపీ నాయకులకు తెలియటంతో వందలాదిమంది టీడీపీ కార్యకర్తలు, నాయకులు రోడ్లపైకి చేరుకుని చించిన ఫ్లెక్సీలను పరిశీలించారు. పట్టపగలే అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో మా ఫ్లెక్సీలు చించివేశారంటూ టీడీపీ నాయకులు ఆరోపించారు. రేపల్లె నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొనివుంటే అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని లక్షలాది రూపాయలు వెచ్చించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ధోరణితో వైసీపీ నాయకులు ఫ్లెక్సీలను చించి ఇష్టమొచ్చినట్లుగా బూతులు తిట్టటం ఎంతవరకు సమంజసమని పోలీసుల ముందు టీడీపీ నాయకులు వాపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఐదు ద్విచక్రవాహనాలపై వైసీపీ నాయకులు ఆళ్ళ రాజ్‌పాల్, ఆకిశెట్టి నాగరాజు, చిత్రాల ఓబేదు, అల్లంశెట్టి శ్రీనివాసరావు, అవనిగడ్డ శ్రీను, సన్ని, అమర్తలూరి కిరణ్‌కుమార్ అనే వ్యక్తులు ఫ్లెక్సీలను చించివేసి బూతులు తిట్టి వీరంగం చేశారని, తక్షణమే వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్లెక్సీలు చించినవారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు అందించినవారిలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, యరగాళ్ళ ధర్మతేజ, పడమటి సాంబశివరావు, గుర్రం మురహరిరావు, కేసన రామకృష్ణ, మద్దుల అంకాలు తదితరులు ఉన్నారు.

# ఎస్మా ప్రయోగంతో జగన్ పతనం మొదలు

- వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్


మాట్లాడుతున్న బీ వెంకట్, పక్కన ఈమని అప్పారావు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 7: అంగన్‌వాడీల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలే ఉన్నారని, వీరిపై ఎస్మా ప్రయోగించడం ద్వారా సామాజిక న్యాయం పదానికి జగన్ చెల్లుచీటీ ఇచ్చినట్టేనని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలపై ఎస్మా ప్రయోగిస్తానన్న ఏకైక సీఎం జగన్ ఒక్కరే అని ఎద్దేవాచేశారు. ఎన్నికల ముందు ఇంత మొండిగా వ్యవహరిస్తున్నారంటే ఆయన ఓటమిని ఆయనే కొని తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఎస్మా జీవో ప్రయోగంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జగన్ చూపుతున్నది కపటప్రేమేనని స్పష్టమవుతోందన్నారు. రైతులకు, కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరసనల్లో భాగంగా ఈనెల 15 వరకు జనజాగరణ సదస్సులు, 26న దేశ వ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు, వ్యవసాయ రంగ సమస్యలపై ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో కార్మికులతో ర్యాలీలు, సదస్సులు, గ్రామీణ బంద్‌లు నిర్వహించనున్నట్టు తెలిపారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీతో అంటకాగుతున్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రదాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# 6 వేల దొంగ ఓట్లు చేర్చుకున్న బొల్లా

- ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధం
- అభివృద్ధి పేరుతో మున్సిపాలిటీ నిధులు గంగపాలు
- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు


సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ

వినుకొండ, జనవరి 7: దొంగ ఓట్లు చేర్చుకున్న బొల్లాకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించి డబుల్ ఎంట్రీ ద్వారా 6వేల ఓట్లను గ్రామాల్లో లేనివారి ఓట్లు చేర్చుకున్నారన్నారు. ఫారం-7 ద్వారా ఆధారాలతో ఫిర్యాదు చేసినా అధికారపార్టీ ఒత్తిళ్లతో ఏం చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారన్నారు. గ్రామాల్లో 4వేల బెల్టుషాపుల ద్వారా క్వార్టర్‌కు రూ.50 చొప్పున బొల్లా ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. అవినీతిని ఎత్తిచూపుతున్న ప్రజాసంఘాలను హేళనగా మాట్లాడటం తగదన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బొల్లా వసూళ్లు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో తన భూముల చుట్టూ మున్సిపల్ నిధులు కేటాయించి రోడ్లు వేసుకున్న ఘనత బొల్లాకే దక్కిందన్నారు. అంగన్‌వాడీలు వినతిపత్రం ఇవ్వడానికి వస్తే వారిపై దుర్భాషలు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలను చులకన చేసి మాట్లాడటం తగదన్నారు. గత ఎన్నికల్లో హామీలు ఇచ్చిన వరికపూడిశెల, తంగిరాల ప్రాజెక్టులు ఏమయ్యాయని, ఎన్నికల ముందు శంకుస్థాపన తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. పట్టణంతో పాటు రూరల్‌మండలాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి పైపులైన్ నిర్మాణం కోసం రూ.250 కోట్ల నిధులు తెస్తే పనులు ప్రారంభించిన దాఖలాలు లేవన్నారు. అనంతరం పద్మావతి యూనివర్శిటీలో ఓఎస్‌డీగా పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ పారా లక్ష్మయ్యను ఈ సందర్భంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు జీవీ తెలిపారు. త్వరలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో పి.వి.సురేష్, గోవిందరాజులు, ఆయూబ్‌ఖాన్, కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రావెల్ క్వారీయింగ్ అడ్డుకున్న టీడీపీ నాయకులు


నదీ తీరంలో గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రదేశం

అమరావతి, జనవరి 7: నదీతీరంలో అక్రమంగా గ్రావెల్ క్వారీయింగ్ చేసి రహదారులకు తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు క్వారీయింగ్ ప్రదేశానికి వెళ్లి అడ్డుకున్న సంఘటన ఆదివారం జరిగింది. స్థానిక వైసీపీ నాయకులు పెద్దింటమ్మ ఆలయం సమీపంలో నదిలో నీటి ప్రవాహం చెంత ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్‌ను క్వారీయింగ్ చేసి బయటకు తరలిస్తున్నారు. గ్రావెల్ క్వారీయింగ్ సమాచారంతో ఆ ప్రదేశానికి వెళ్లిన టీడీపీ నాయకులు వాహనాలు తిరగకుండా రోడ్డుపై అడ్డుగా బైటాయించారు. గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ జరుగుతోందని పోలీసు అధికారికి చెప్పినప్పటికీ స్పందించలేదని, అందుకే తాము రహదారిపై బైటాయించామని టీడీపీ నాయకులు తెలిపారు. అనంతరం సీఐ బ్రహ్మం ఆదేశాల మేరకు ఎస్ఐ నాగేంద్ర క్వారీయింగ్ ప్రదేశానికి వెళ్లి టీడీపీ నాయకులను పంపించి వేశారు. టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో క్వారీయింగ్ కూడా నిలిచిపోయింది. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను, డ్రైవర్లు అక్కడ నుంచి తీసుకువెళ్లారు.

# రేపటి నుంచి ఎంపీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు

- లోకేశ్ జన్మదినం సందర్భంగా టోర్నీ నిర్వహణ
- విజేతగా నిలిచిన జట్టుకు రూ.2 లక్షల బహుమతి
- మొదటి విడత డ్రా తీసిన టీడీపీ నేతలు


డ్రా తీస్తున్న అబద్దయ్య, జానకీదేవి తదితరులు

మంగళగిరి సిటీ, జనవరి 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా ఈ నెల 23వ తేదీన మంగళగిరి ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. మంగళగిరి పట్టణ పరిధిలో జాతీయ రహదారి వెంబడి వున్న నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో ఈ నెల 9 నుంచి 28వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. పోటీల్లో పాల్గొనేందుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి వంద జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం మొదటి విడత డ్రా తీసి పోటీ పడే జట్ల వివరాలను వెల్లడించారు. విజేతగా నిలిచిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.రెండు లక్షలను తెలుగు మహిళ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మాలపాటి పుల్లయ్య చౌదరి, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్షను టీడీపీ నేత ఇట్టా పెంచలయ్య, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.50వేలను ఎర్రబాలెం టీడీపీ గ్రామకమిటీ ఆర్థిక సహకారంతో అందించనున్నట్లు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కింద రూ.2వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద రూ.పది వేలు, బెస్ట్ బ్యాటర్, బెస్ట్ బౌలర్‌కు రూ.5వేల చొప్పున తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో అందిస్తామన్నారు. క్రీడాకారులకు టీషర్టులను టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటరు తరఫున అందిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో లోకేశ్ మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసి వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్పాన్సర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలి

- విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్
- కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఉపకారవేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు అందజేస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 7: యువత చదువును ఒక అస్త్రంగా భావించి అవకాశాలను అందిపుచ్చుకుని స్వయంకృషితో ఎదగాలని విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కేఎల్‌పీ స్కూల్‌లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రమేష్‌కుమార్ మాట్లాడారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమేనని చెప్పారు. ప్రతిభతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, పుట్టగుంట వేణుగోపాలరావు, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, నామినేని కోటేశ్వరరావు, జాస్తి కృష్ణకుమారి, మద్దినేని గోపాలకృష్ణ, కావూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 299మంది విద్యార్థులకు రూ.17వేల చొప్పున మొత్తం రూ.49లక్షల ఉపకారవేతనాలు అందజేశారు

# వైసీపీలో మాలల వ్యతిరేకతా రాగం

- కార్యాచరణపై గుంటూరులో సమావేశం
- బలసాని కిరణ్‌కుమార్‌ను సమన్వయకర్తగా నియమించడంపై చర్చ
- తమకు స్పష్టమైన హామీ ఇచ్చినవారికే మద్దతు
- ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన మాల సంఘం నాయకులు


గుంటూరులో జరిగిన సమావేశానికి హాజరైన మాల సంఘం నాయకులు

ప్రత్తిపాడు, జనవరి 7: ప్రత్తిపాడు నియోజకవర్గంలో మాల సామాజిక వర్గం నుండి వైసీపీకి వ్యతిరేక పవనాలు మొదలయ్యాయి. తొలిసారి వైసీపీలో ఉన్న మాల సంఘం నాయకులు సమావేశమై తమ భవిష్యత్తుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించే పనిలో ఉన్నారు. వైసీపీకి బలంగా ఉన్న ఆ సమాజిక వర్గం ప్రత్తిపాడు నియోజకవర్గంలో తొలిసారి బలసాని కిరణ్ కుమార్‌కు వ్యతిరేకంగా గళం విప్పింది. గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో మాల సంఘం నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఓట్లు ఉన్న తమ సామాజిక వర్గానికి కాకుండా మాదిగ సామాజికవర్గానికి చెందిన బలసాని కిరణ్‌కుమార్‌ను సమన్వయకర్తగా నియమించడంపైనే ఇక్కడ చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో ప్రత్తిపాడుకు చెందిన ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తుంది. సమన్వయకర్తగా కిరణ్‌కుమార్‌ను నియమించిన నాటి నుండి మాలలను దూరం పెడుతూ వస్తున్నారనే వాదన ఆ వర్గం నుండి బలంగా వినిపిస్తోంది. ఆయన వద్ద మాదిగలకే ప్రాధాన్యత ఉంటుందని, మాలలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంలో కమ్యూనిటీ స్థలంలో నివాసం ఉంటున్న మాల సామాజిక వర్గంకు చెందిన గృహాలను కూల్చివేసే విషయంలో బలసాని పాత్ర ఉందనే అనుమానాలు కూడా ఆ వర్గం నుండి వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో 45 వేల ఓట్లు ఉన్న తమకు ఏ పార్టీ ప్రాధాన్యత ఇస్తే వారికి మొగ్గు చూపేందుకు వీరు సిద్ధమయినట్టు తెలిసింది. మాలల వ్యతిరేక రాగంతో ప్రత్తిపాడు వైసీపీలో ఒక్కసారిగా వణుకు మొదలైంది. ప్రత్తిపాడు ఎంపీపీ భర్త చెంచు రామారావుతో పాటు సీనియర్ వైసీపీ నాయకుడు వాడపల్లి ప్రాన్సిస్, నడింపాలెం ఎంపీటీసీ వాసిమళ్ల మాణిక్యరావు, మాజీ ఎంపీటీసీ భాగ్యారావు, మామిడి అశోక్, తుమ్మలపాలెం ఎంపీటీసీ భర్త ఏసోబు, కొండేపాడు వైస్ ప్రసిడెంట్ మేరిబాబు, నేలపాటి అనిల్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావడం వైసీపీ నాయకులను కలవరపాటుకు గురి చేసింది.

# వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి మళ్లీ విరిగిన స్ప్రింగ్

- రెండు రోజులుగా గంటల తరబడి రీషెడ్యూల్

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి మళ్లీ ప్రైమరీ స్ప్రింగ్ విరిగింది. ఈ నెల 5వ తేదీన రాత్రి మెయింటెనెన్స్‌కి వెళ్లినప్పుడు సాంకేతిక సమస్యని గుర్తించి సరిచేయడానికి సమయం తీసుకున్నారు. దాంతో శనివారం ఈ నెల 6వ తేదీన 4.15 గంటల పాటు రీషెడ్యూల్ చేసి నెంబరు.20701 సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్‌ని నడిపారు. ఇది తిరుపతికి చేరుకోవడానికి ఆలస్యం కావడంతో తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరాల్సిన నెంబరు.20702 వందేభారత్‌ని 4.30గంటల పాటు రీషెడ్యూల్ చేశారు. దాని ప్రభావం ఆదివారం కూడా కనిపించింది. ఆదివారం 2 గంటల 45 నిమిషాలు సికింద్రాబాద్ వైపున, 2 గంటలు తిరుపతి వైపున రీషెడ్యూల్ చేశారు. సోమవారం కూడా కనీసం గంట నుంచి గంటన్నర ఆలస్యంగా ఈ రైలు రీషెడ్యూల్ జరిగే అవకాశం ఉంది. మంగళవారం వందేభారత్ సర్వీసు ఉండదు కాబట్టి బుధవారం నుంచి షెడ్యూల్ ప్రకారం నడిచే అవకాశం ఉన్నది.


### క్యాటరింగ్ సర్వీసులో సమస్యలు

వందేభారత్ రైలు సికింద్రాబాద్‌లో ఎక్కితే ఆ రైలు గుంటూరుకు చేరుకొనేలోపు బుకింగ్ చేసుకొన్న వారికి అల్పాహారం అందిస్తారు. ఒంగోలు తర్వాత మధ్యాహ్న భోజనం ఇస్తారు. అలానే తిరుపతి నుంచి సికింద్రాబాద్ వచ్చే రైలులో ఒంగోలు వరకు స్నాక్స్, గుంటూరు నుంచి రాత్రి భోజనం ఇస్తారు. రీషెడ్యూల్ కారణంగా వీటిని సకాలంలో అందించలేని పరిస్థితి తలెత్తుతున్నది. భోజన సమయంలో స్నాక్స్ ఇస్తున్నారు. దీనిపై ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తికి గురౌతున్నారు.

### అర్ధరాత్రి దాటాక గమ్యస్థానానికి చేరుకొంటుండటంతో...

తిరుపతి నుంచి వచ్చే వందేభారత్ రీషెడ్యూల్ చేయడం వలన ఈ రైలు సికింద్రాబాద్ చేరుకొనేసరికి అర్ధరాత్రి దాటి ఒక్కోసారి మరుసటి రోజు వేకువ జాము అవుతోంది. దీంతో అక్కడ దిగిన వారికి తగిన రవాణా సదుపాయాలు లేక స్టేషన్‌లోనే ఉదయం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ రైలులో ఉండే చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లు పూర్తిగా సిట్టింగ్ శ్రేణికి చెందినవి. పగలు ప్రయాణం దృష్టిలో పెట్టుకొని రూపొందించినవి. అలాంటిది ఇప్పుడు రీషెడ్యూల్ కారణంగా రాత్రి వేళ ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ఎక్కువసేపు కూర్చోలేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

# కాల్వలో పడిన 108 వాహనం


కాల్వలో పడిన 108 వాహనం

అమృతలూరు, జనవరి 7: రోగిని వైద్యశాలకు తీసుకువెళుతున్న 108 వాహనం కాల్వలో పడిన సంఘటన ఆదివారం జరిగింది. నిజాంపట్నం మండలం గోకర్ణమఠం గ్రామానికి చెందిన బర్రి నరసింహారావు నిజాంపట్నం వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. అక్కడ పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేశారు. ఈ క్రమంలో నరసింహారావును 108లో తెనాలి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మండలంలోని పెదపూడి వంతెన వద్ద దట్టమైన మంచు వల్ల రోడ్డు సరిగా కనపడక కృష్ణ పశ్చిమ డెల్టా పశ్చిమ మధ్య కాల్వలో పడింది. ఈ ఘటనలో రోగితోపాటు ఉన్న కుటుంబసభ్యులకు చిన్నపాటి గాయాలయ్యాయి. అంబులెన్స్ టెక్నీషియన్ దున్న సురేష్‌కు పక్కటెముకలు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఈ స్థలంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్త పరుస్తున్నారు. ఈ ప్రదేశంలో రెయిలింగ్‌తోపాటు పటిష్టంగా ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుచున్నారు.

# అనుమానంతోనే అంతమొందించాడు..

పిడుగురాళ్ళ, జనవరి 7: అనుమానంతో మహిళను హత్య చేసిన సంఘటన మండలంలోని పాతగణేషునిపాడు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గురజాల డీఎస్పీ పల్లంరాజు కథనం మేరకు... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వజ్రగిరి పాపులమ్మ అలియాస్ జ్యోతి(35) భర్త మూడు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. మండలంలోని పాతగణేషునిపాడు గ్రామానికి చెందిన డికొండ కిరణ్‌కుమార్ పిడుగురాళ్లలోని కార్తికేయ హోటల్లో వంట మాస్టార్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కిరణ్ కుమార్ భార్య నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయింది. భర్త చనిపోయిన పాపులమ్మ జీవనోపాధి నిమిత్తం కార్తికేయ హోటల్లో పనిచేస్తుండేది. ఆ సమయంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడి సహజీవనం చేస్తున్నారు. అంతకుముందే పాపులమ్మకు నాగరాజు అనే అతనితో పరిచయం ఉంది. అయితే ఇకనుండి తనకు, నాగరాజుకు ఏలాంటి సంబంధం లేదని కిరణ్‌కుమార్‌కు జ్యోతి చెప్పింది. కానీ కిరణ్‌కుమార్ పాపులమ్మపై అనుమానం పెంచుకున్నాడు. నాగరాజుతో పాపులమ్మ మరలా ఫోన్లో మాట్లాడుతోందని, నాగరాజు, పాపులమ్మ ఇంటికి వచ్చి వెళ్తున్నాడనే అనుమానంతో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ మధాహ్నం 3గంటలకు పాపులమ్మ పాతగణేషునిపాడు గ్రామంలోని కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చింది. ఇరువురి మధ్య నాగరాజు విషయంపై గొడవ జరుగుతుండగా సుమారు 7గంటల సమయంలో కిరణ్‌కుమార్ అక్కడే ఉన్న రోకలిబండతో పాపులమ్మ తలమీద బలంగా కొట్టి చంపివేసి పారిపోయాడు. ఈ సంఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత అనుమానాస్పద మృతి


దేవీబాయి మృతదేహం

కారంపూడి, జనవరి 7: వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మండంలోని హనుమాపురంతండాలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బర్మానాయక్, దేవీబాయి(30)లు దంపతులు. వీరు రాత్రి పొలానికి కాపలా నిమిత్తం వెళ్లారు. తెల్లారేసరికి దేవీబాయి పొలంలో విగతజీవిగా కనిపించింది. కాగా మృతురాలి తండ్రి బాబానాయక్ తన కుమార్తెను అల్లుడే హత్య చేశారని ఆరోపిస్తున్నారు. బర్మానాయక్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ క్రమంలో భార్యాభర్తలకు ఘర్షణ జరగడంతో దేవీబాయిని బర్మానాయక్ హత్య చేశాడని గ్రామంలో చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయకుమార్ చెప్పారు. మృతురానికి కుమార్తె, ఇరువురు కుమారులు ఉన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 83, 98, 105 |
| చికెన్ విత్ స్కిన్ | 170.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 180.00 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు




సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా

## సంస్కృతి, సంప్రదాయాలు జాతి సంపద

- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు అభినందనీయం
- శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా

నరసరావుపేట కల్చరల్, జనవరి 7 : సంస్కృతి, సంప్రదాయాలు జాతి వారసత్వ సంపద అని, వాటిని తర్వాతి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా తెలి పారు. ఆదివారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి నిర్వహించిన కెనర బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు ముగ్గులు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నమన్నారు. అపార్ట్‌మెంట్ల సంస్కృతి వచ్చాక మహిళలకు ముగ్గులు వేసే అవకాశం తగ్గి పోయిందని, అలాంటి పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి పోటీల ద్వారా కొత్తతరానికి ముగ్గులపై ఆసక్తిని కలిగించవచ్చన్నారు. చిన్నతనంలో ప్రతి వీధిలో పెద్ద పెద్ద ముగ్గులు వేసేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. నగరీకరణలో ఇంటి ముందు ఆవరణ లేక మహిళలు ముగ్గులు వేయలేక పోతున్నారన్నారు. ఇలాంటి పోటీల ద్వారా మహిళలకే ప్రత్యేకమైన ముగ్గుల కళను బతికించుకోవచ్చన్నారు. ప్రస్తుత సాంకేతిక కాలంలో ఇప్పటి తరం పాశ్చాత్య సంస్కృతిని వంటపట్టించుకుని మన సంస్కృతిని మరిచిపోతున్నదన్నారు. అలాంటి వారికి మనదైన సంస్కృతని తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. గుప్తా సతీమణి అనూరాధ మాట్లాడుతూ ప్రస్తుత పోటీకాలంలో ఆడపిల్లలు చదువుల్లో పడి మన సంస్కృతిని మర్చిపోతున్నారని, వారికి సంస్కృతి గురించి తెలియ చెప్పాల్సిన బాధ్యత మనదేనన్నారు. యువ వ్యాపారవేత్తలు రూపేష్‌గుప్తా, రాందేవ్‌గుప్తాలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ పోటీలకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు.

## ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన

- జిల్లా నలుమూలల నుంచి పోటీకి హాజరు


ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బాంక్ ముత్యాల ముగ్గుల పోటీకి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో 116 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పొందిన పాపన సుజాత ముప్పాళ్ల మండలం మాదల గ్రామం నుంచి వచ్చి పాల్గొంది. ద్వితీయ బహుమతి పొందిన కుంట దుర్గా దేవి వినుకొండ పట్టణం నుంచి వచ్చింది. అలాగే మొదటి కన్సోలేషన్ బహుమతి పొందిన వగ్రా శిరీష నడికుడి నుంచి ద్విచక్రవాహనంపై వచ్చి పాల్గొనడం గమనార్హం. తృతీయ కన్సోలేషన్ పొందిన ఎ.పావని ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీపై ఆసక్తితో సత్తెనపల్లి నుంచి వచ్చి పాల్గొన్నారు. అంతేకాదు పదేళ్ల పాప నుంచి డెబ్బై ఏళ్ల పండు ముదుసలి వరకు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఎస్ఎస్ఎన్ కళాశాలలో వెటర్నరీ సైన్స్ డిప్లొమా చదువుతున్న సత్తెనపల్లికి చెందిన ఆయేషా అనే ముస్లిం విద్యార్థిని ఈ ముగ్గుల పోటీలో పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీకగా కన్పించింది. పోటీలలో పాల్గొన్న మహిళలందరూ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతికి ముక్తకంఠంతో జయహో అన్నారు.

## కోటనెమలిపురిలో కోలాహలంగా ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న కన్నా నాగరాజు తదితరులు

రాజుపాలెం, జనవరి 7 : సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో ఆదివారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు హాజరై పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మండల మహిళ అధ్యక్షులు నెల్లూరి అహల్యారాణి, మండలాభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నర్రా బాబురావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, పార్లమెంటు కమిటీ సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వర్ల శ్రీను, వేపూరి రామయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శనగపూల వెంకయ్య, శనగపూల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, జనవరి 7 : విశ్వ బ్రహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు తిప్పర్తి మధులత అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని 14వ వార్డులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి సుంకర సరస్వతి, సుష్మ భవానీ, ద్వితీయ బహుమతి కల్లూరి మహేశ్వరి, తృతీయ బహుమతి వంగిపురపు హైమ, నాల్గవ బహుమతి కోటగిరి శ్రావణి, ఐదవ బహుమతి సుంకర రాజేశ్వరి కైవసం చేసుకున్నారు. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కోటగిరి పోతులూరయ్య, అద్దంకి సరిత, గోవిందమ్మ, కల్లూరి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 12న సంక్రాంతి ముగ్గుల పోటీలు

క్రోసూరు, జనవరి 7 : క్రోసూరులోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఈనెల 12వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ముగ్గుల పోటీల నిర్వహణ కమిటీ తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, 5వ బహుమతి రూ 5వేలు ఉంటాయన్నారు. రూ.100 ఎంట్రీ ఫీజుతో 10వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వెల్లడించారు. కట్టమూరి అప్పారావు, 9440836608 నెంబరులో సంప్రదించాలన్నారు.

## కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సత్తెనపల్లి, జనవరి 7 : సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయిలో ఈనెల 8వ తేదీ నిర్వహించనున్న కబడ్డీ పోటీలకు విద్యా కేంద్రం కళాశాల ఆవరణలో క్రీడా మైదానం సిద్ధమైంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గంలోని యువతను ప్రోత్సహించేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, కబడ్డీ పోటీల కన్వీనర్ దరువూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పీఈటీ దాసరి కోటేశ్వరరావు పర్యవేక్షణలో పోటీలు జరగనున్నాయి. 50 టీమ్‌లు వరకు ఈ పోటీల్లో పాల్గొంటాయని పీఈటీ దాసరి కోటేశ్వరరావు తెలిపారు. 9వ తేదీ విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

## మాచవరం పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు

మాచవరం, జనవరి 7 : మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినట్లు వైద్యాధికారి చక్రవర్తి ఆదివారం తెలిపారు. సెప్టెంబరు నెలలో ఢిల్లీ నుంచి వచ్చిన బృందం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందించే వివిధ రకాల సేవలను గుర్తించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపడంతో జాతీయ స్థాయి వైద్య సిబ్బంది మాచవరం పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపునిస్తూ ప్రశంసాపత్రాన్ని అందించారు. గుర్తింపు రావడానికి కృషి చేసిన కలెక్టర్ లోతేటి శివశంకర్, డీఎంహెచ్‌వో రవి, ఎంపీడీవో వర్షప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు డాక్టర్ చక్రవర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


మాచవరం పీహెచ్‌సీలో ఢిల్లీ బృందంతో వైద్య సిబ్బంది

## కొనసాగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె


సత్తెనపల్లిలో కళ్లు మూసుకొని ఆందోళన కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

సత్తెనపల్లి, జనవరి 7 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 27వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై స్పందించకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించటంపై అంగన్‌వాడీ కార్యకర్తలు కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. కనీస వేతనాల అమలుకు, హక్కుల సాధన కు, శాంతియుత సమ్మెకు దిగితే ఎస్మా ప్రయోగిస్తా మని బెదిరించటం ముఖ్యమంత్రి జగన్‌కు తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సుజాత, అహల్య, సీఐటీయూ నాయకులు పెండాల మహేష్ తదితరులు పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్య పోషణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అంగన్ వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెను విరమించుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు కోరారు.

● అమరావతి, జనవరి 7 : గత 27 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా సమస్యలు పరిష్కారం చేసేంత వరకు తమ నిరసన కార్య క్రమం కొనసాగిస్తామని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తెలిపారు.

### అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం హాస్యాస్పదం

గురజాలటౌన్, జనవరి 7 : మూడు నెలల్లో దిగిపోయే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఆరు నెలలు ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం హాస్యాస్పదంగా ఉందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అహంకారానికి, అంగన్‌వాడీల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న యుద్ధంలో అంగన్‌వాడీలు విజయం సాధిస్తారన్నారు. జీవో నంబరు2తో అంగన్‌వాడీలను అత్యవసర సేవల్లోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని, అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని అంకారావు చెప్పారు.

● సత్తెనపల్లి, జనవరి 7 : అంగన్‌వాడీల పై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిచేటి వేణుగోపాల్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీలపై ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బీమినేని వందనా దేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించటం చేతగాని ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఉపయోగించి ఉద్యమాన్ని అణగదొక్కాలను కోవటం దుర్మార్గం అన్నారు.

## 13వ రోజుకు చేరుకున్న మునిసిపల్ కార్మికుల సమ్మె

సత్తెనపల్లి, జనవరి 7 : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో చింతగుంట్ల వెంకయ్య, వంగిపురపు చంద్రకళ, కమలమ్మ, చిలక సునీత, తెలగాల కోటేశ్వరి, మేడి సత్యవతి, మేడి ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

### సమ్మెకు కేసీపీ కార్మికులు సంఘీభావం

మాచర్ల రూరల్, జనవరి 7 : పట్టణంలో పురపాలక సంఘ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆదివారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు సంఘీభావం తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో బండారు శ్రీను, వెంకయ్య, వెంకటరమణ, సత్యం, సీఐటీయూ నేతలు మహేష్, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘీయుల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే పీఆర్కే


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, జనవరి 7: ముదిరాజ్ సంఘీయుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్ కల్యాణ మండపం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ముదిరాజ్ సంఘీయులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు. పట్టణంలో కల్యాణ మండపం నిర్మాణానికి 15 సెంట్లు స్థలం కేటాయించడంతోపాటు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

● రెంటచింతల, జనవరి 7 : రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ పేర్ల చౌడమ్మ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 7143 మందికి పింఛన్లు అందచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ నర్శిరెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు దాసరి చౌడేశ్వరీ, శౌరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎన్.భాస్కరరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, మాజీ డైరక్టర్లు ఇన్నారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వాసవి ఆలయ చైర్మన్ కట్టమూరి నాగేశ్వరరావు, గొట్టం భాస్కరరెడ్డి, వైసీసీ మండల యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, చల్లా మట్టారెడ్డి, ఏరువ ప్రతాపరెడ్డి, ఏరువ భాస్కరరెడ్డి, డీడీవో మహాలక్ష్మి, గిరిజన సంఘం అధ్యక్షులు బుడ్డ షైదానాయక్, పమ్మి సీతయ్య, కుర్రి సాయిమార్కొండారెడ్డి, గూలి వెంకటరెడ్డి, ముత్తయ్య యాదవ్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్

విజయపురిసౌత్, జనవరి 7: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ఆదివారం మాచర్ల మండలం చెంచుకాలనీ, పెద అనుపు చెంచుకాలనీ, బ్రహ్మానందపురం తండాలలో ఆయన పర్యటించారు. ఓటు హక్కులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో చెంచులకు అందుతున్న మౌలిక వసతులను తెలుసుకున్నారు. ఆయా చోట్ల చెంచులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్, డీఎల్‌డీవో గబ్రూనాయక్, ఎంపీడీవో సరోజినిదేవి, జడ్పీటీసీ మల్లుస్వామి, వీఆర్వో అంజి తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

## బాధితులకు ఆర్థిక సాయం

అచ్చంపేట, జనవరి 7 : అచ్చంపేటలోని బీసీ కాలనీలో ఇటీవల ఆటో ప్రమాదానికి గురై గాయపడిన కత్తుల కమల, పొగడ్డల త్రివేణికి టీడీపీ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ గాయపడ్డ బాధితులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. పార్టీ నాయకుల ద్వారా వీటిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, వి.కోటయ్య, రాయుడు సాంబశివుడు, సందెపోగు సామేలు, అంగులూరి తిరుపతిరావు, తాళ్లూరి రాంబాబు, సందెపోగు కిరణ్, కోట చంటి, మేకల హనుమయ్య, సందెపోగు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వోన్నత పాఠశాలను సందర్శించిన పీడీ

విజయపురిసౌత్, జనవరి 7: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలను శనివారం బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తాటి భాస్కరబాబు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలను ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు చాంద్‌బాషా సందర్శించి భోజనశాల ఏర్పాటుకు హామీనిచ్చారని చెప్పారు. ఇందుకు అయ్యే వ్యయ అంచనాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యాభివృద్ధికే గాక మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట విజయపురిసౌత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కోటేశ్వరరావు ఉన్నారు.

## 10 నుంచి నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్

మాచర్ల, జనవరి 7: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈనెల 10వ తేదీ నుంచి వైసీపీ ఆధ్వర్యాన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు ఈనెల 9వ తేదీ సాయంత్రం కల్లా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9985674385, 9666080013లను సంప్రదించాలన్నారు.

## చెంచులకు అవగాహన సదస్సు

కారంపూడి, జనవరి 7: మండలంలోని ఒప్పిచర్లలో ఆదివారం పీఎం జన్‌మన్ కార్యక్రమం సర్పంచ్ ఇరికిదిండ్ల రమణ కొండలు ఆధ్వర్యాన చెంచులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని 30 చెంచు కుటుంబాలకు 11 సౌకర్యాల కల్పనపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి రాజు, పంచాయతీ సెక్రటరీ కసిన్యానాయక్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీవో ఏడుకొండలు, హౌసింగ్ ఏఈ నజీరుద్దీన్ పాల్గొన్నారు.

## లూథరన్ చర్చికి రూ.25 లక్షలు కేటాయింపు

రెంటచింతల, జనవరి 7 : రెంటచింతలలోని అతి పురాతనమైన లూథరన్ చర్చికి మహర్దశ పట్టింది. ఈ చర్చికి మరమ్మతులు నిమిత్తం రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఆదివారం చర్చిని ఆయన సందర్శించారు. పాస్టర్ ఏసు దానం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దళిత నేతలు డేగల మహేష్, సామ్యేలు, సంషోన్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, ఫిలోమిన్ రాజు, రత్నం తదితరులున్నారు.

## ఉత్సవ మూర్తుల ఊరేగింపు

సత్తెనపల్లి, జనవరి 7 : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తి విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవ మూర్తులను సందర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వివిధ వేషధారణలతో, కోలాట ప్రదర్శనలతో ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపు సందర్భంగా పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## పుస్తక పఠనంతో మేధోసంపత్తి వృద్ధి

పెదకూరపాడు, జనవరి 7 : పుస్తక పఠనం వల్ల మేధోసంపత్తి పెరుగుతుందని స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ ఉప సంచాలకులు కొర్లకుంట వెంకట సుబ్బారావు అన్నారు. మండలంలోని లగడపాడులో జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్నేహితుల సహకారంతో సత్యం ఈ గ్రంథాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షులు చిల్లపల్లి సత్యం, ప్రొఫెసర్ డాక్టర్ కొమరాబత్తిన ఏలియా, మోదేపల్లి రమాదేవి, షేక్ అక్బర్, సామ్రాజ్యం, మన్నవ వెంకటరావు, డాక్టర్ వెంకటరావు పాల్గొన్నారు.


గ్రంథాలయ ప్రారంభంలో పుస్తకాలను చూపుతున్న స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్ ఉప సంచాలకుడు సుబ్బారావు తదితరులు

## బాపతు శ్రీనివాసరెడ్డికి మంత్రి అంబటి పరామర్శ

నకరికల్లు, జనవరి 7 : మండలంలోని కుంకలగుంట - 1 ఎంపీటీసీ బాపతు శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను జల వనరుల మంత్రి అంబటి రాంబాబు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి భార్య విజయ లక్ష్మి శనివారం మృతి చెందింది. విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించిన మంత్రి అంబటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పక్కాల సూరిబాబు, మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వనిపెంట వీరారెడ్డి, అవుదూరి అంజిరెడ్డి, పుల్లారెడ్డి, ఉప్పరపల్లి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

మాచర్ల, జనవరి 7 : పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద అనాథ శవానికి ఆదివారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెట్టు గోవిందరెడ్డి అంత్యక్రియలు జరిపారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లి దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహించారు. ఆయన వెంట గాజుల నరసింహారావు, ఓబులశెట్టి నాసరయ్య, వీరయ్య తదితరులు ఉన్నారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మాచవరం, జనవరి 7 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వర్షప్రసాద్ ఆదివారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

## రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 7 : రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత తెలుగుదేశం అభిమానులు అందరిపై ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బెంగుళూరులోని టీడీపీ ఫోరంలో శనివారం నియోజకవర్గానికి చెందిన ఐటీ ఎంప్లాయిస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఐటీ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ తెలుగుదేశం ఫోరం పేరిట పది సంవత్సరాల పాటు సేవలను అందిస్తున్న ఫోరం కమిటీ సభ్యులను చూసి ఆనందం కలుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత సొంత గ్రామాలకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు కనకమేడల వీర శ్రీకాంత్, సోంపల్లి లెనిన్ చౌదరి, నల్లూరి విష్ణు, బొల్లినేని రమేష్, అనుమోలు శివ, కేశవ్, కే వెంకట రత్నం, విజయ్, రాంభూపాల్, సుధాకరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నాను ఫోరం సభ్యులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## సైకో పాలన అంతానికి నడుం బిగించాలి


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

క్రోసూరు, జనవరి 7 : రాష్ట్రంలో సైకో పాలన అంతానికి ప్రతి టీడీపీ కార్యకర్త నడుం బిగించాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంట్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దుద్దుల యోహాన్ అన్నారు. ఆదివారం క్రోసూరులోని టీడీపీ కార్యాలయంలో వారు కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో చంద్రబాబు నాయుడు రా కదలిరా అంటూ ముందుకు దూకుతున్నారని ప్రతి కార్యకర్త ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ, బీసీ, మైనార్టీలు దగా పడ్డారని, యువతరం ఉద్యోగ అవకాశాలు లేక చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, నలజాల కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోకా వెంకటరావు, మన్నెం శ్రీనివాసరావు, షేక్ ముస్తఫా, అనుమాల పూర్ణ, గోగిశెట్టి వెంకటరావు, ఆది శ్రీను, మల్లాల రామాంజనేయులు, కొమ్మినేని సతీష్, బండారు మైసూర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే : అలీబాషా

నకరికల్లు, జనవరి 7 : రాష్ట్రంలో ఈ ఏడాదిలో జరిగే సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాషా అన్నారు. ఆదివారం నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసిన ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. రాష్ట్రానికి రాజధాని అమరావతేనని, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాలపాటి మహంకాళిరావు, కిష్టంశెట్టి చిన్న, గోపు శ్రీనివాసరావు, బేరాల గోవిందరాజులు, కొల్లి హరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## దేచవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కడియాల లక్ష్మి

నకరికల్లు, జనవరి 7 : నరసరావుపేట కడియాల హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం దేచవరం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు ఉచితంగా ఆల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, డాక్టర్ కడియాల లక్ష్మి, డాక్టర్ శ్రీరామినేని సుధీర్, డాక్టర్ శ్రీరామినేని హిందూజా, డాక్టర్ కొనికినేని బ్రహ్మేశ్వరరావు వైద్య సేవలు అందించారు. కాటూరి హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ దీపిక, డాక్టర్ ప్రియాంక వైద్య సేవలు అందించారు. గంగవరపు జగన్నాథం, సరోజిని జ్ఞాపకార్థం వారి కుమారులు గంగవరపు వెంకట కోటేశ్వరరావు, లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మొక్కలను నాటారు. కార్యక్రమంలో దరువూరి రాజ, గంగవరపు నాగేశ్వరరావు, ముప్పాళ్ళ కామేశ్వరరావు, పెమ్మసాని బంగారు బాబు, సోమేపల్లి కోటయ్య, గోడపాటి బంగారు బాబు, కంకణంపాటి శివయ్య, పెమ్మసాని భాస్కరరావు, గంగవరపు ఆదినారాయణ, కండ్లకుంట నారాయణ పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్, జనవరి 7 : మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ మాగులూరి భాను ప్రకాష్(యూఎస్‌ఏ) ఆర్థిక సహకారంతో శంకర కంటి ఆస్పత్రి వారితో మండలంలోని భట్లూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు కంటి, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కంటి శుక్ల ఆపరేషన్‌లు అవసరమైన వారికి త్వరలో తేదీ ప్రకటించి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించనున్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న వైద్యులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాను ప్రకాష్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈదర రాంబాబు, పోపూరి యతీష్, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, సిద్దయ్య, కొండవీటి ప్రసాదు, వెంకట్, వెల్లలచెరువు సురేష్, భావన రాంబాబు, నాగేశ్వరరావు, పద్మ పాల్గొన్నారు.

## నేడు ముగ్గురు రాజుల మహోత్సవ తిరునాళ్ల


విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆర్‌సీఎం దేవాలయం

పెదకూరపాడు, జనవరి 7 : పెద కూరపాడులోని ఆర్‌సీఎం దేవాలయం లో ముగ్గురు రాజుల మహోత్సవ సమ ష్ఠి పూజాబలి ఈనెల 8న జరుగుతుందని స్థానిక ఆర్‌సీఎం చర్చి విచార ణ గురువులు మోన్ సిగ్నోర్, పుట్టి సుం దరరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు దివ్య పూజా బలి, మధ్యాహ్నం 3 గంటలకు కొవ్వొత్తు ల, కానుకల సమర్పణ, సాయంత్రం 6 గంటలకు కోలాట ప్రదర్శన, 9 గంటలకు బాణసంచాలతో గ్రామ వీధుల్లో తేరు ప్రదర్శన జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి విచారణ గురువులు, మఠ కన్యలు పాల్గొంటారని వివరించారు.

## రేపు బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో బహిరంగ వేలం

బెల్లంకొండ, జనవరి 7 : బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో ఈనెల 9వ తేదీన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తాలూకా ఎస్ఐ అమీర్ పేర్కొన్నారు. గత సంవత్సరం తెలంగాణ నుంచి మద్యం, కాపు సారా తెస్తున్న వాహనాలను ఆపి కేసు నమోదు చేశారు. ఎస్పీ రవి శంకర్‌రెడ్డి, సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఐదు వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఎస్ఐ పేర్కొన్నారు. పాడుకున్న వాహనాలకు నగదు వెంటనే చెల్లించాలని ఆయన తెలిపారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



నరసరావుపేటలో నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శారదాంబ జ్యూయలర్స్ ముగ్గుల పోటీలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఏబీఎన్- ఆంధ్రజ్యోతి

## ముగ్గుల పోటీకి విశేష స్పందన

● జిల్లా నలుమూలల నుంచి హాజరు

నరసరావుపేట కల్చరల్, జనవరి 7: పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీకి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి మహిళలు వచ్చి పాల్గొనడం విశేషం. ఈ పోటీలలో 116మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పొందిన పావన సుజాత ముప్పాళ్ల మండలం మాదల గ్రామం. ద్వితీయ బహుమతి పొందిన కుంట దుర్గాదేవి వినుకొండ పట్టణం. అలాగే మొదటి కన్సోలేషన్ బహుమతి పొందిన వర్రా శిరీష నడికుడి నుంచి ద్విచక్రవాహనంపై వచ్చి పాల్గొనడం గమనార్హం. తృతీయ కన్సోలేషన్ పొందిన ఎ. పావని ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీపై ఆసక్తితో సత్తెనపల్లి నుంచి వచ్చి పాల్గొన్నారు. అంతేకాదు పదేళ్ల పాప నుంచి డెబ్బై ఏళ్ల పండు ముదుసలి వరకు ఈపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో వెటర్నరీ సైన్స్ డిప్లొమా చదువుతున్న సత్తెనపల్లికి చెందిన ఆయేషా అనే ముస్లిం విద్యార్థిని ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొనడం తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా కన్పించింది. పోటీలలో పాల్గొన్న మహిళలందరూ ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతికి ముక్తకంఠంతో జయహో అన్నారు. పోటీ అనంతరం జరిగిన సమావేశం అయిపోయేంత వరకు అందరూ ఆసక్తిగా కూర్చున్నారు. చివరికి పాల్గొన్న ప్రతి ఒక్కరూ బహుమతి అందుకుని ఆనందంగా తిరిగి వెళ్లారు.

## సంస్కృతి, సంప్రదాయాలు జాతి సంపద

● ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు అభినందనీయం
● శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా



బహుమతి పంపిణీ సభలో మాట్లాడుతున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత, నాగసరపు సుబ్బరాయ గుప్తా, వేదికపై అనురాధ, రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తా

నరసరావుపేట కల్చరల్, జనవరి 7: సంస్కృతి, సంప్రదాయాలు జాతి వారసత్వ సంపద అని, వాటిని తర్వాతి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా తెలిపారు. ఆదివారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గులు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నమని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ల సంస్కృతి వచ్చాక మహిళలకు ముగ్గులు వేసే అవకాశం తగ్గిపోయిందని, అలాంటి పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించడం



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు కే భవానీ, టీ విజయలక్ష్మి

అభినందనీయమని తెలిపారు. ఇలాంటి పోటీల ద్వారా కొత్తతరాలపై ఆసక్తిని కలిగించవచ్చన్నారు. చిన్నతనంలో ప్రతి వీధిలో పెద్ద పెద్ద ముగ్గులు వేసేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. నగరీకరణలో ఇంటి ముందు ఆవరణ లేక మహిళలు ముగ్గులు వేయలేక పోతున్నారన్నారు. ఇలాంటి పోటీల ద్వారా మహిళలకే ప్రత్యేకమైన ముగ్గులతో కళను బతికించుకోవచ్చన్నారు. ప్రస్తుత సాంకేతిక కాలంలో ఇప్పటితరం పాశ్చాత్య సంస్కృతిని వంటపట్టించుకుని మన సంస్కృతిని మరిచిపోతున్నారన్నారు. అలాంటి వారికి మనదైన సంస్కృతని తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. గుప్తా సతీమణి అనూరాధ మాట్లాడుతూ ప్రస్తుత పోటీకాలంలో ఆడపిల్లలు చదువుల్లోపడి మన సంస్కృతిని మర్చిపోతున్నారని, వారికి సంస్కృతి గురించి తెలియచెప్పాల్సిన బాధ్యత మనదేనన్నారు.

యువ వ్యాపారవేత్తలు రూపేష్‌గుప్తా, రాందేవ్‌గుప్తాలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ పోటీలకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు.

### అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

●ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

నరసరావుపేట టౌన్, జనవరి 7: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 19వ రోజు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆందోళన నిర్వహించారు. ఆందోళన కార్యక్రమానికి యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు మద్దుకూరి మోహనరావు, అల్లి చిన కోటేశ్వరరావు, మురికిపూడి సుబ్రహ్మణ్యం సంఘీభావం తెలియజేశారు. అదేవిధంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల యూనియన్ నాయకులు ఎన్. శ్రీనివాసనాయక్, పీ.ఏడుకొండలు, కే.శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరనాయక్, వీ లాలూ నాయక్, ఎం.శ్రీనివాసరావు, తదితరులు సమగ్రశిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

### కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల దీక్షలు

చిలకలూరిపేట, జనవరి 7: చిలకలూరిపేట మునిసిపాలిటీలో మునిసిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమ్మెను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తే ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, రైతు సంఘం, మునిసిపల్ వర్కర్ల సంఘం నాయకులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, తాళ్ళూరి బాబూరావు, కొమరగిరి చెంచయ్య, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలు కుటుంబాలు

రొంపిచర్ల, జనవరి 7: మండలంలోని తుంగపాడులో వైసీపీ నుంచి పలువురు కార్యకర్తలు టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవిందబాబు సమక్షంలో శనివారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని అరవిందబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో గౌరవం లేదని, తమను బానిసలుగా చూస్తున్నారని వాపోయారు. అరవిందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అందరికీ సమన్యాయం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య, ప్రధాన కార్యదర్శి పల్లెల నాగిరెడ్డి, మల్లికార్జునరావు, శివనాగరాజు, సాయి, పున్నారావు, చౌడయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు కన్న కలలను నాశనం చేశారు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పుల్లారావు

నాదెండ్ల, జనవరి 7: క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం ద్వారా రాష్ట్ర ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్న చంద్రబాబు కన్న కలలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గణపవరంలో రాజీవ్‌గాంధీ కాలనీలో ఆర్‌జీసీ బాయిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ నైట్ క్రికెట్ టోర్నమెంట్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా సౌకర్యాలను అస్తవ్యస్తం చేసి జగన్ ఇప్పుడు ఆడుదాం ఆంధ్రా పేరిట దొంగాట ఆడుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాష్ట్రంలో ఒక్క స్టేడియం ఐనా నిర్మించారా? అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడాభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలో ఒక్క మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామ, క్రీడల సాధనతో శారీరక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### రెండు తడులకైనా నీరు ఇవ్వాలి

నాదెండ్ల, జనవరి 7: ఎండిపోతున్న మెట్ల పైర్లను కాపాడటానికి కనీసం రెండు తడులకైనా సాగు నీరు ఇవ్వాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణ చంద్రరరావు కోరారు. తాగునీటితో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీరు ఇచ్చి పంటలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

### వృద్ధులకు సాధన సేవాసమితి చీరెల పంపిణీ

యడ్లపాడు, జనవరి 7: యడ్లపాడు సాధన సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు చీరెలు, పండ్లు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు కేతా రాంబ్రహ్మం, నాగవర్ధని దంపతుల కుమార్తె సాధన జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎర్రచెరువులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150మందికి కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ జి సుబ్బారావు, చిలకలూరిపేట ఎల్ఐసీ ఏబీఎం నాగేంద్రబాబు, విశ్రాంత తహసీల్దార్ ధూళిపాళ్ల ఏసుబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ కె నాగేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు జె శేషయ్య, ఫార్మసిస్ట్ ఎ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్లు పంపిణీ

యడ్లపాడు, జనవరి 7: యడ్లపాడు ఎంపీపీ కార్యాలయం వద్ద పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైసీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు అన్నీ తనకు తెలుసని, అన్నిటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో కొత్తగా 287 పింఛన్లు మంజూరయ్యాయని, వాటితో కలుపుకుని నియోజకవర్గంలో 37,980 మంది పింఛన్లు అందుకుంటున్నారన్నారు. ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమారెడ్డి, జెడ్పీటీసీ ముక్తా వాసు, ఎంపీటీసీ సభ్యులు అరుణ్, సుభాని, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### పేద బ్రాహ్మణులకు బియ్యం, వస్త్రాల అందజేత

వినుకొండ టౌన్, జనవరి 7: పట్టణంలోని ఆరుగురు బ్రాహ్మణులకు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో ఆదివారం బియ్యం, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సచివాయల విభాగ కమిషనర్ ఎ.రాధాకృష్ణమూర్తి హాజరై సేవా సమితి చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సి.రాఘవేంద్రరావు, మల్లికార్జునరావు, చంద్రమౌళి, డి.రామమూర్తి, సుబ్బారావు, ఆదిచంద్రశేఖరశాస్త్రి, శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఎం.వి.శర్మ, మురళీధర్, శంకరరావు, బి.రవికుమార్, డి.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎస్ఎస్.ఎం.శాస్త్రి, బి.సుబ్రహ్మణ్యం, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎస్మా ఉత్తర్వులు దహనం



ఎస్మా ఉత్తర్వులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు

నరరావుపేట టౌన్, జనవరి 7: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ, సీఐటీయు, ఐఎఫ్‌టీయు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగించారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం జారీచేసిన ఎస్మా ఉత్తర్వులు 2 నంబరు జీవోను దహనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వేల్పుల సింహాద్రియాదవ్, మాలమహానాడు గోదా జాన్‌పాల్, సీపీఐ కాసా రాంబాబు, సీఐటీయు షేక్ శిలార్ మసూద్, సీపీఎం గుంటూరు విజయకుమార్, శ్రామిక మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ డీ శివకుమారి, ఉప్పలపాటి రంగయ్య, సీఐటీయు కార్యదర్శి కేపీ మోటీల్డాదేవి, ఏఐటీయుసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డాఫ్లారేన్స్, నిర్మలా, మల్లేశ్వరి, అంగన్‌వాడీలు, ప్రజా సంఘాలనాయకుల పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేటలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. విజయవాడలో, పల్నాడు జిల్లాలో అంగన్ వాడీలు చేస్తున్న దీక్షలకు మద్దతుగా స్థానిక గ్రంథాలయం సెంటర్‌లో అంగన్ వాడీలు రిలే నిరాహార దీక్షలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 9వ తేదీన అన్ని సంఘాలతో కలసి జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈ సందర్భంగా దీక్షా శిబిరం సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు ప్రకటించారు. సంఘం అధ్యక్షురాలు జీ సావిత్రి మాట్లాడుతూ అంగన్ వాడీల సమ్మెను విరమింప చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు.

● వినుకొండటౌన్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) నాయకులు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శిబిరం వద్ద పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్మా చట్టం ఎవరికి వర్తిస్తుందనే విషయంపై కార్యకర్తలకు వివరించారు. కేవలం ప్రభుత్వ అత్యవసర సేవల లిస్ట్‌లో ఉన్నవారికి మాత్రమే ఎస్మా చట్టం వినియోగిస్తారని, మీరు భయపడాల్సిన అవసరం లేదని అంగన్‌వాడీలకు మనోధైర్యాన్ని నింపారు. అంగన్‌వాడీలు ప్రభుత్వ అత్యవసర సేవల్లో లేరని, ఇది ప్రభుత్వం గుర్తించాలని అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు లక్ష్మీప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, అంజనేయులు, శారమ్మ, ఉమాశంకరి, నాగజ్యోతి, పద్మ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

### చిలకలూరిపేటలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

చిలకలూరిపేట, జనవరి 7: పట్టణంలోని సాధినేని చౌదరయ్య స్కూల్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు జరిగాయి. 40 టీమ్‌లు ఈ సంబరాల్లో పాల్గొన్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించే పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మద్దిరాల నవోదయ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో రెంటచింతల వివేకానంద టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో చిలకలూరిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ప్రథమ స్థానంలో నిలిచిన ఈ రెండు టీమ్‌లను ఎంపిక చేశారు. స్కూల్ డైరెక్టర్ సీహెచ్ ప్రభాకరరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బెల్లంకొండి వీరాంజనేయులు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పీవీ సుబ్బారావు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దార్ల బుచ్చిబాబు, ప్రసాదు, కోశాధికారి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఒయాసిస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న చిత్రం

### పేదలకు ఒయాసిస్ సంస్థ సాయం

చిలకలూరిపేట, జనవరి 7: స్థానిక ప్రముఖ సేవా సంస్థ ఒయాసిస్ 17వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక నన్నపనేని వెంకటరత్నం కల్యాణ మండపంలో ఆదివారం సంస్థ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కంది మళ్ళ జయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు సుమారు రూ.8లక్షలు విలువచేసే వివిధ రకాల సాయాన్ని అందజేశారు. 15 కుట్టు మిషన్‌లు, నాలుగు ట్రై సైకిళ్ళు, 14 మంది విద్యార్థులకు రూ 1.10 లక్షల స్కాలర్ షిప్‌లు, వైద్య సహాయం నిమిత్తం రూ.25వేలు, వివాహ ఖర్చుల నిమిత్తం రూ 15వేలు ఈ సందర్భంగా అతిథులు అందజేశారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ధనలక్ష్మి గ్రూపు సంస్థల డైరెక్టర్ పేర్ని వీర నారాయణ, టెక్స్‌టైల్ అసోసియేషన్ అధ్యక్షులు పెరవలి కోటిరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన కరణం విజయలక్ష్మి, కరీమా, కోల విజయలక్ష్మి, డాక్టర్ ప్రపుల్లాదేవి, జాష్టి ప్రమీల, పీ నిర్మల, సీహెచ్ లలితాదేవి, ఎం ఇందిర, ఏ శైలజ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

వినుకొండ, జనవరి 7: కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణం కోసం పట్టణంలోని వ్యాపారవేత్త మాదాల వెంకటశివకోటేశ్వరరావు రూ.2,01,116లు పట్టణాభివృద్ధి సేవా సంఘం సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను సంఘం సభ్యులు అభినందించారు.

### పొగాకు సాగులో రైతులకు అవగాహన

వినుకొండ, జనవరి 7: పొగాకు పంటలో రైతులకు అధికదిగుబడులు, లాభాలు వచ్చేలా సలహాలు, సూచనలు అందజేస్తున్నామని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో సీటీఆర్, జీపీఐ సూచనలతో రైతులు పండిస్తున్న పొగాకు పంటను శేషుమాధవ్ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ సి.చంద్రశేఖరరావు,జీపీఐ మేనేజర్ జి.రమేష్‌రాజు, వినుకొండ ఏరియా బ్రాంచి మేనేజర్ సీహెచ్.వీరారెడ్డి, గోవిందు వినయ్ పాల్గొన్నారు.

### పరీక్షలలో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం, జనవరి 7: వినుకొండలోని గంగినేని ఫౌండేషన్, శావల్యాపురంలోని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్షలలో 153మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు మర్రి యశోధర్, పొత్తూరి సాయిసుభాష్, మానం హేమంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు నిర్వాహకులు జి.రాఘవ, మోహన్‌చంద్‌లు తెలిపారు.